క్లుప్తంగా

గంగాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేకాలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచ ర్లలో ఉన్న శ్రీ గంగాలమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆషాఢ మాసం ఆదివారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి సారె, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రాదాలు అందించారు.

శాకంబరిగా పార్వతీదేవి



నరసాపురం: పట్టణంలోని శ్రీపార్వతీ కపిలమల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిను శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసం కావడంతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ అర్చకుడు అయిలూరి దత్తసాయి, ఆలయ ఈఓ కె.రామచంద్రరావు పర్యవేక్షించారు.

భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు



గోశాలలో గోవులకు గ్రాసం అందిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

నరసాపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లబ్ నరసాపురం శాఖ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్ అన్నారు. క్లబ్ జోన్ చైర్మన్ అప్పన బదిరీ, రీజనల్ చైర్మన్ వి.శ్యామల పర్యటన సందర్భంగా ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆదికేశవ ఎంబేరుమానార్ కోవెలలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించారు. గోశాలలో గోవులకు గ్రాసం పెట్టారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.బాబ్జి, ట్రెజరర్ కోట్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



రేవు లక్ష్మీగాయత్రి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రేవు లక్ష్మీ గాయత్రి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆదివారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ రెండో జాబితాలో లక్ష్మీ గాయత్రి ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైందని హెచ్ఎం రామరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని సర్పంచ్ అద్దాల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు స్వామి, విద్యా కమిటీ చైర్మన్ చూడామణి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలో ఆషాఢ మాసం సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. తోట భోగయ్య, చిలుకూరి రామకృష్ణ చౌదరి, ముత్యాల రామారావు, ఇంటి సత్యనారాయణ, ముత్యాల అంజి, చోటిశెట్టి కిరణ్, ముత్యాల అయ్యప్ప, వలవల సాయి, యర్రా లక్ష్మణ జ్యోతి స్వరూప్, మెంటేవారి తోట యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు



బండి శ్రీనివాసరావు

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆదివాసి ఎరుకల సేవ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం అసిస్టెంట్ పోస్ట్మాస్టర్‌గా భీమవరం నందు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆదివాసి ఎరుకల సేవా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకర రావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చాలా మల్లేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆదివాసి ఎరుకల హక్కుల కొరకు, అణగారిన ఎరుకుల కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కొరకు తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకి ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాస రావును వివిధ జిల్లాల అధ్యక్షులు అభినందించారు.

అంతర్గత రహదారులు అస్తవ్యస్తం

- దారుణంగా మారిన అప్రోచ్ రోడ్లు
- వర్షాకాలం వస్తుందంటే జనం హడల్



పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో అప్రోచ్ రోడ్డు

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు ఎంతోకాలం నుంచి చేపట్టకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తుందంటే వణకిపోతున్నారు. గతంలో ప్రస్తుత పాలకవర్గం హయాంలో దశలవారీగా పట్టణంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. గత 20 ఏళ్లుగా పట్టణంలో అంతర్గత రోడ్లు నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. ప్రధాన రహదారులు తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించడం లేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఖరికు భారీగా నిధులు వచ్చిపడ్డ 2014 పుష్కరాల సమయంలో కూడా వార్డుల్లో ప్రజలు మొరపెట్టుకున్నా పాలకవర్గాలు అప్రోచ్ రోడ్లు వేయడానికి ప్రయత్నమే చేయలేదు.

ఎన్నో ఇబ్బందులు

అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో పట్టణంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గట్టిగా వర్షాలు పడితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కానీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్‌రోడ్లు లేవు. గత 25 ఏళ్ల నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి. దీంతో మట్టిదిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి. ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇదే తరహా ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27, 28 వార్డుల్లోనూ, మునిసిపాలిటీ మురికివాడలుగా గుర్తించిన అరుంధతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా అప్రోచ్‌రోడ్లు నిర్మించాల్సి ఉంది. వీటి అన్నింటినీ దశల వారీగా నిర్మించాలని 2023 డిసెంబర్‌లో మున్సిపాలిటీ నిర్ణయించి ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు ఊసే లేకుండా పోయింది.

అప్రోచ్ రోడ్ల సమస్య ఉంది



వార్డుల్లో చాలా ప్రాంతాల్లో అప్రోచ్‌రోడ్లు లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్లు పూర్తిస్థాయిలో అయితే 5 కిలో మీటర్లు వరకూ ఉంటాయని గతంలో గుర్తించాం. దశల వారీగా అప్రోచ్ రోడ్ల రిర్మాణాలు పూర్తి చేయాలని అనుకున్నాము కానీ జరగలేదు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తేగానీ చేయలేం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మున్సిపాలిటీకి ఎలాంటి నిధులు రాలేదు.

–బర్రి శ్రీవెంకటరమణ మునిసిపల్ చైర్‌పర్సన్

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేదు గౌరవం లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షురాలు మద్దా చంద్రకళ, నియోజకవర్గ మునిసిపల్ విభాగం అధ్యక్షులు జోగి వెంకటేశ్వరరావులు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. గుడివాడలో కృష్ణాజిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశానికి వెళుతున్న మహిళా చైర్మన్‌ను మహిళ అని కూడా గౌరవం లేకుండా దుర్భాషలాడని దాడులకు తెగబడడం దుర్మార్గపు చర్యని తీవ్రంగా ఖండించారు. ఒక జెడ్పీ చైర్మన్‌కే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజలకు ఈ కూటమి ప్రభుత్వంలో రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. కారును ధ్వంసం చేసిన టీడీపీ కేడర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా దాడికి గురైన వారిని అక్కడ నుండి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పడం ఏంటి? అని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీలో మహిళలకు సముచిత స్థానం

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు గౌరవం, సముచిత స్థానం కల్పిస్తుందని నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవులు పొందిన మహిళలు గోపిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కేసులు కట్టేస్తున్నారని మహిళలపై అయితే ఏకంగా దాడులు చేసేస్తున్నారని ఇంత దారుణమైన ప్రభుత్వం ఏనాడూ చూడలేదన్నారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన నాయకులు మహిళలు అందరూ పార్టీ కేడర్‌ను కలుపుకుని నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన పట్టణ మహిళా అధ్యక్షురాలు కడలి రామలక్ష్మి, సెక్రటరీ మాముడూరి మణి, పట్టణ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు కుడుపూడి నాగలక్ష్మి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లికార్జునుడులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల తాతాజీ, మద్దా చంద్రకళ, శశికళ, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, వాసంశెట్టి సుబ్బయ్య, చింతలపాటి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ మహిళా సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటు



కోట శ్రీనివాసరావును సన్మానిస్తున్న కళాకారులు (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని పట్టణ కళాపరిషత్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణానికి చెందిన శత చిత్రాల సినీ దర్శకులు కోడి రామకృష్ణ 1996 మే నెలలో లలిత కళాంజలి నాటక అకాడమీ ద్వారా 16వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో కోట శ్రీనివాసరావును సన్మానించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ, సభ్యులు జక్కంపూడి కుమార్, మేడికొండ శ్రీనివాసరావు, కేఎస్‌పీఎస్ వర్మ, విటాకుల రమణ, మానాపురం సత్యనారాయణ, కొణిజేటి గుప్త, దాసరి నాని, రెడ్డి వాసు తదితరులు సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

లక్ష్మణరెడ్డికి సత్కారం



లక్ష్మణరెడ్డిని సత్కరిస్తున్న పశ్చిమ రెడ్డి ప్రముఖులు

పెనుమంట్ర: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, మార్టేరు ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణరెడ్డిని విశాఖపట్నంలో నివాసం ఉంటున్న పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి కమ్యూనిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. విశాఖపట్నంలో ఉంటున్న రెడ్డి కుటుంబాల ఆత్మీయ కలయిక ఆదివారం విశాఖపట్నంలోని టీఎస్సార్ గార్డెన్‌లో చేశారు. మార్టేరులోని పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాత ఫౌండేషన్ ఏర్పాటు చేసి మూడున్నర సంవత్సరాలుగా ప్రతిరోజూ 30 మంది అనాథ నిరాశ్రయులకు అన్నం పెట్టే కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్న లక్ష్మణరెడ్డి సంఘ సేవలను గుర్తించి ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించి సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

దొరగారి చెరువు తవ్వకం పనులు ప్రారంభం



స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు తవ్వుతున్న దృశ్యం

ఊపిరి పీల్చుకుంటున్న ఆక్రమణదారులు

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా చెరువులోని నీటిని బయటకు తోడి ఎండగట్టారు. వర్షాల కారణంగా తవ్వ పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం చెరువులోని పూడిక మట్టిని గట్లవారకు చేవేసే పనులు చేస్తున్నారు. గత ఏడాది చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా పూడిక తీత పనులు ప్రారంభించారు. చెరువు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 60 లక్షలు రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. చెరువు ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్, పూడిక తీత పనులు తదితర పనులతో చెరువును ఆహ్లాదకరంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. అయితే కొంత సొమ్ము వెచ్చించి వాకింగ్‌ట్రాక్, చెరువులో చెత్త, పూడిక తొలగింపు, ఫెన్సింగ్ వంటి పనులను చేసి, సంబంధిత కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత పూడిక తీత పనులకు నగర పంచాయతీ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిసింది.

పొలం తగాదాలో వాగ్వాదాలు



వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద ఘర్షణ పడుతున్న దృశ్యం

వీరవాసరం: పొలం తగాదా విషయమై పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్సై సమక్షంలోనే బెదిరింపులకు, వాగ్వాదాలకు పాల్పడిన సంఘటన ఆదివారం వీరవాసరం పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. ఉనికిలి గ్రామానికి చెందిన వట్టికూటి సుబ్రహ్మణ్యం, ఆరవల్లి గ్రామానికి చెందిన రెడ్డిలకు గత కొంతకాలంగా అండలూరు గ్రామంలో ఉన్న తమ వరి పొలాల వద్ద సరిహద్దు తగాదాలు ఉన్నాయి. వీరు ఇరువురు గతంలో వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల వద్ద పొలం తగాదా విషయమై అర్జీలు చేసుకోవడం జరిగింది. ఇదే సంఘటనపై ఇరువురు వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ ఆదివారం సరిహద్దు తగాదా సంఘటన పై వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ వివరాలు సేకరిస్తుండగా వట్టికూటి సుబ్రహ్మణ్యంతో పాటు అతనితో వచ్చిన మరి కొంతమంది కలిసి తగాదాకి దిగారు. పోలీసులు ఎంత వారిస్తున్న ఇష్టానుసారం మాట్లాడుతూ ,బెదిరింపులు చేస్తూ తగాదా పడడంతో రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు సైతం ఆగి మరి చూస్తూ ముక్కుని వేలేసుకున్నారు. స్టేషన్ వద్ద ఇటువంటి గలాటా ఏమిటి అంటూ చెవులు కొరుక్కున్నారు.

బ్రహ్మరాజుకు అభినందనలు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కలిదిండి బ్రహ్మరాజు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ ఇంజనీర్స్(ఐఐపి ఈ) జాతీయ స్థాయి హానరరీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీన బెంగళూరులో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈయనను ఎన్నుకొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) (ఐఈఐ) జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కూడా పని చేసి పలు దేశాలు కూడా సాంకేతిక పర్యటన జరిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మరాజును పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి హిందువు చేతిలో భగవద్గీత ఉండాలి



చిన్నారులకు మెమొంటోలు, ప్రసంశా పత్రాలు అందజేసిన దృశ్యం

ఆకివీడు: ప్రతీ హిందూవు చేతులో భగవద్గీత ఉండాలని, ప్రతీ ఇంట్లో గీత, రామాయణ, మహాభారతాలుండాలని ఉత్తమ ఉపాధ్యాయులు, ఆధ్యాత్మికవేత్త తెన్నేటి లక్ష్మీ నర్సింహమూర్తి అన్నారు. స్థానిక మాదివాడ దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం హైందవ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. పోటీల్లో 70 మంది చిన్నారులు పాల్గొన్నారు. విద్యార్థులకు మూడు విభాగాలుగా పోటీలు నిర్విహించారు. రామ సమూహంలో మొదటి మూడు బహుమతులను మనస్విని, టీ.కార్తీక సాయి, వీ.చేతన, సీతా సమూహంలో జీ.తేజస్వి, పీ.షణ్ముఖ ధనుశ్రీ, రుషిక, లక్ష్మణ సమూహంలో జే.నందిని, టీ.గీతావైష్ణవి, బీ.హేశ్రీలు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు నాగ శశికళ చెప్పారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా తెన్నేటి మాస్టార్, అడ్వకేట్ నెల్లి సతీష్, చిర్రావూరి సూర్యనారాయణమూర్తి, రీడర్స్‌ఫోరం అధక్షులు డీవీ.సత్యనారాయణ, బొప్పెర్ల మూర్తి, లంక జలదుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకర్లకు సత్కారం



బాలేపల్లిలో ర్యాంకర్లకు సత్కారం చేస్తున్న దృశ్యం

వీరవాసరం: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన తమ మిత్రుని కుమారులను 1986–87 వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పదో తరగతి మిత్ర బృందం ఆదివారం సత్కరించింది. బాలేపల్లి గ్రామానికి చెందిన పాలా శ్రీనివాసరావు, జయశ్రీ కుమారులు రోహిత్ పాలీసెట్ 2025 రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు, మరో కుమారుడు రోహన్ ఏపీ ఆర్‌జె సి 2025లో 227 ర్యాంకు సాధించారు. భీమవరం తిరుమల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వీరు అదే కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఐఐటి లక్ష్యంగానే ముందుకు సాగుతున్నట్టు రోహిత్, రోహన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యేలూరి భాను కుమారి, వలవల జానకిరామ్, ముద్రగడ శ్రీనివాసరావు, నిమ్మల దుర్గ, గునిశెట్టి మంగతాయారు, చల్లాయమ్మ, పంతం రాము, కోరసిక వీర్రాజు, ఆర్‌కె నాయుడులు పాల్గొన్నారు.

ఎంఆర్ ఆశయసాధనకు కృషి చేయాలి



సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ, తదితరులు

కాళ్ల: పద్మశ్రీ డాక్టర్ ఎం.ఆర్.రాజు ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజులు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ట్రస్టు భవనంలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు (ఎం.ఆర్.రాజు) స్మృత్యంజలి సభలో వారు పాల్గొని మాట్లాడారు. సభకు పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించి, క్యాన్సర్ వ్యాధిపై అమెరికాలో పరిశోధనలు చేసి, స్వగ్రామం పెదఅమిరంలో మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సుమారు 4 దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. ఆయన ఆశయసాధనకు అనుగుణంగా ఎంజీఎం ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కేంద్రం భీమవరంలో సైన్స్ పార్కు ఏర్పాటు చేసి దానికి డాక్టర్ ఎం.ఆర్.రాజు పేరు పెట్టాలని సర్వోదయం మండలి తరపున వినతి పత్రాన్ని ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈసభలో ఎం.ఆర్.రాజు కుమారులు మంతెన రామకుమార్ రాజు, దంతులూరి రంగరాజు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ ఎస్.ఆర్. పరిమి, పలువురు డాక్టర్లు,పెద్దలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

అధిక పన్నులు వసూలు చేస్తే చర్యలు

నరసాపురం: నరసాపురం మున్సిపల్ రోజువారీ మార్కెట్ పన్నులు వసూళ్లకు సంబంధించి కాంట్రాక్టర్ గెజిట్‌లో ఉన్న రేట్లు ప్రకారం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అధిక పన్నులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారుస్తులు గెజిట్ ప్రకారమే పన్నులు ఇచ్చి రశీదు తీసుకోవాలని సూచించారు. పాటదారుడు వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. పాట 9 సార్లు వాయిదా పడ్డాక, తక్కువ మొత్తం రూ.38 లక్షలకు ఖరారు చేశామని పేర్కొన్నారు.

మహిళలపై దాడులు అమానుషం



ఇందిరా సీతారామ్

పెనుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలు పెరిగిపోయాయని, దాడులు చేయడం అమానుషమని ఆచంట ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ విమర్శించారు. ఆదివారం కొడమంచిలిలో విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ , బీసీ మహిళా నేత ఉప్పాల హారికపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేయడం దుర్మార్గపు చర్య అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మహిళలపై ప్రత్యక్ష, పరోక్ష దాడులు జరుగుతున్నా హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆచంట నియోజకవర్గం పోడూరు మండలం పండితవిల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రికపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పరోక్ష దాడులకు పాల్పడుతున్నారన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళ చెక్ పవర్ రద్దు చేయడం దారుణమన్నారు. అదేవిధంగా పెనుగొండ పంచాయతీలో ఎస్సీ వర్గానికి చెందిన సర్పంచ్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలపై ప్రత్యక్ష, పరోక్ష దాడులకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకోడేరు: భీమవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడులలో పాలకోడేరు మండలం, మొగల్లు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎ.లక్ష్మీ గణేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి. సునీల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం సీఐ కె.బలరామరాజు తెలిపారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలు



ప్రవచనం చెబుతున్న శ్రీనివాస రామానుజ దాస్

భీమవరం: బొండా సుబ్బారావు 11వ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజ భవనం)లో నంబూరు శ్రీ కాశీ వన ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ చంద్ర కాశీ ప్రసాద మాతాజీ శిష్యులు శ్రీనివాస రామానుజ దాస్ ప్రవచనాలు చెప్పారు. మహాభారతంలోని మధుర ఘట్టాలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభ కార్యక్రమాన్ని భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గతించిన తండ్రి బొండా సుబ్బారావు వర్ధంతిని ప్రతి ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలుగా నిర్వహిస్తున్న బొండా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను అభినందించారు.